సాక్షి శ్రీకాకుళం

సోమవారం ; 22 ; జనవరి ; 2024

న్యూస్‌రీల్

నేటి నుంచి డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వర్సిటీ పరిధిలో 101 డిగ్రీ కళాశాలలు ఉండగా, 61 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్య పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష నిర్వహణ సామగ్రిని పరీక్ష కేంద్రాలకు చేర్చారు. ఈ పరీక్షలకు రెగ్యులర్, బ్యాక్ లాగ్ సబ్జెక్టులు ఉన్న 14,950 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. పరీక్షలు సోమవారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు.

నేడు బోధనేతర సిబ్బందితో సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం బోధనేతర సిబ్బందితో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని సమీక్ష నిర్వహించనున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఆదివారం తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఈ సమీక్ష ఉంటుందని, అందరూ హాజరు కావాలని తెలిపారు. కార్యాలయాల పనితీరు, సేవలు, ఉద్యోగుల సమస్యలపై సమీక్ష ఉంటుందని అన్నారు.

ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో గత రెండు రోజులుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలతో పాటుగా ఆస్పత్రిలోని ప్రధాన ప్రాంతాల్లో మొత్తం 28 సీసీ కెమెరాలను శని,ఆదివారాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగంతో పాటుగా ఓపీ, వైద్యులు గదులు, వార్డుల సమీపంలోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాల కంట్రోల్ మొత్తం ఆస్పత్రి సూపరిండెంటెంట్ వద్దనే ఉంటుందని తెలిపారు. గతంలో ఆస్పత్రి వద్ద పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీకి గురికావడం, మరికొన్ని సంఘటనల దృష్ట్యా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


స్నేహితుడి కుటుంబానికి సాయం



రూ.60 వేలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: తమతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు చనిపోయాడని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అతడి కుటుంబానికి సాయం చేసి అండగా నిలిచారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన కృష్ణారావు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005–06 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు రూ.60 వేలు నగదును కృష్ణారావు కుటుంబానికి అందజేశారు. ఏ పరిస్థితుల్లో అయినా తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

ఖేలో ఇండియాలో శ్రీకాకుళం సత్తా



కడపల సౌమ్యరాణి | ముద్దాడ శిరీష | రెడ్డి పావని

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ నేషనల్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. చెన్నైలో జరుగుతున్న ఈ పోటీల్లో ఆలిండియా నేషనల్స్ జూడో పోటీల్లో కడపల సౌమ్యరాణి రజత పతకంతో సత్తాచాటింది. ఇదే వేదికగా జరుగుతున్న సౌత్‌జోన్ నేషనల్స్ ఉషూ(మార్షల్ ఆర్ట్స్) పోటీల్లో ముద్దాడ శిరీష బంగారు పతకంతో మెరవగా, రెడ్డి పావని రజత పతకం సాధించి శభాష్ అనిపించింది. జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పతకాలు సాధించడంపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు, సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మందస: హనుమాన్ పతాకం వద్ద కూర్చున్న వానరం

● రావయ్యా.. రామయ్యా



కాశీబుగ్గ: కొత్తపల్లి రమేష్ ఆచారి తయారు చేసిన స్వర్ణ విల్లు

అయోధ్యకు రామచంద్రుడి ఆగమనం భక్తులను ఆనంద డోలికల్లో ముంచెత్తుతోంది. బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రామ భక్తులు ర్యాలీలు చేసి, భజనలు పాడి, అక్షతలు పంచి సంబరం చేసుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన నాడు ఊరూరా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



జలుమూరు: శ్రీముఖలింగంలో ఊరేగింపు నిర్వహిస్తున్న రామ భక్తులు

పల్లె గళమున.. ప్రగతి నివేదన

- అభివృద్ధి దిశగా మండపల్లి
- ప్రభుత్వ కార్యాలయాలతో పల్లెకు కొత్త కళ
- శిథిల పాఠశాల భవనాలకు అధునాతన శోభ
- పల్లెలో వచ్చిన మార్పుపై చర్చలు



గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం | వైఎస్సార్ హెల్త్ క్లినిక్ | పాలవెల్లువ కేంద్రం | సర్కారు పాఠశాల



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి మారింది. ఎంతలా అంటే.. వాన కురిస్తే చెరువును తలపించే అక్కడి పాఠశాల ఇప్పుడు కార్పొరేట్ స్కూల్ మాదిరిగా కనిపిస్తోంది. చిన్నపాటి జ్వరానికి కూడా ఇచ్ఛాపురం పరిగెత్తిన పల్లె వాసి.. ఇప్పుడు ఊరిలో కొలువుదీరిన విజేల్ క్లినిక్‌లో చికిత్స తీసుకుంటున్నారు. విత్తనం కావాలంటే వ్యవసాయం కార్యాలయం వద్ద కనీసం రెండు రోజులైనా నిలబడాలని నిశ్చిత అభిప్రాయం ఉన్న అన్నదాత.. రైతు భరోసా కేంద్రం నీడలో నిశ్చింతగా విత్తనం నుంచి విక్రయాల వరకు అన్ని లావాదేవీలు జరుపుకుంటున్నాడు. సంక్రాంతికి సొంతూరు వచ్చిన పలువురికి ఈ మార్పులు సుస్పష్టంగా కనిపించాయి. నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు వారిని ఆశ్చర్యపరిచాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మండపల్లి ముంగిట్లోకి వచ్చి చేరిన ప్రభుత్వ కార్యాలయాలు, జనాలకు అందుతున్న సేవలు వారికి ముచ్చటగొలిపించాయి.

ప్రారంభానికి సిద్ధమైన కార్యాలయాలు..

నిన్నటి వరకు పాడుబడిన భవనంలో ప్రాథమిక విద్య సాగించిన విద్యార్థుల కోసం ఇప్పటికే కోట్ల రూపాయలతో అధునాతన భవనాలతో ఉన్నత పాఠశాల ఉన్నతంగా రూపుదిద్దుకుంది. రూ.2కోట్ల 19లక్షలతో పాఠశాల భవనాలకు రంగులతో పాటు ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, డైనింగ్ హాల్, విద్యుత్, కిచెన్ షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఇప్పుడు ఏకంగా 700కు పైబడి చదువుతున్నారంటే అతిశయోక్తికాదు. మారుమూల ప్రాంతంలో ఉన్న మండపల్లి ప్రజల కోసం రూ.కోటి 50 లక్షలతో నాడు–నేడు పాఠశాల భవనాలు, రూ.21 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మించారు. గతంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నా, ఎరువులు కొనుగోలు చేయాలన్నా మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇచ్ఛాపురం వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థానికంగా రైతులకు చేదోడు,వాదోడుగా ఉండేందుకు రూ.24లక్షలతో 'రైతు భరోసా కేంద్రం' ఏర్పాటు చేశారు. వీటితో పాటు రూ.15.74లక్షలతో జగనన్న పాలవెల్లువ భవనం, సుమారు రూ.40 లక్షలతో గారమ సచివాలయం, రూ.60లక్షలతో సిమ్మెంట్ రోడ్లు, రూ.22 లక్షలతో తాగునీటి మంచినీటి బోర్లు ఏర్పాటు చేశారు.

మా ఊరు ఎంతో మారింది



పదిహేనేళ్ల క్రితం ఆర్మీలో జవాన్‌గా ఉద్యోగం సంపాదించాను. ప్రస్తుతం ఊటీలో సుబేదార్‌గా ఉన్నత ఉద్యోగం చేస్తున్నాను. ఒకటి నుంచి 7వ తరగతి వరకు మండపల్లిలోనే నా విద్యాభ్యాసం సాగింది. ఆ సమయంలో బడిలో కనీస వసతులు ఉండేవి కావు. వర్షం వస్తే చాలు బడికి సెలవులు ఇచ్చేవారు. మొన్నటి వరకు విత్తనాలు కావాలన్నా, వైద్యం కావాలన్నా, కుల ధ్రువీకరణ పత్రం కావాల్సి వచ్చినా ఇచ్ఛాపురం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. రెండేళ్ల తర్వాత ఊరు వచ్చాను. ఇప్పుడు ఊరు చాలా మారింది. వీధుల్లో సిమ్మెంట్ రోడ్లు, మంచినీటి బోర్లు, అవసరాలకు ప్రభుత్వ కార్యాలయాలు, సీఎం జగనన్న వచ్చినాక మా ఊరు చాలా మారిపోయింది. ఇప్పుడు పట్టణాన్ని తలపిస్తోంది.

– బుడ్డేపు పురుషోత్తం, ఆర్మీ సుబేదార్, మండపల్లి

జగనన్నతోనే గ్రామాభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాభివృద్ధి అనడానికి మా మండపల్లి పంచాయతీయే చక్కటి ఉదాహరణ. గతంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయం లేని మా పంచాయతీలో ఏకంగా కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. పేదల నుంచి ధనవంతుల వరకు ప్రభుత్వ పరమైన అవసరాల కోసం మండలానికి వెళ్లే పరిస్థితి లేదు. ముస్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో మండపల్లి పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాం.

– పిట్ట శేషమ్మ, సర్పంచ్, మండపల్లి పంచాయతీ

తిరుమల దేవస్థానానికి నిమ్మతొర్లాడ బెల్లం



టీటీడీకి బెల్లాన్ని పంపే వాహనానికి పూజలు చేస్తున్న రైతులు

ఆమదాలవలస రూరల్: మండలంలో నిమ్మతొర్లాడ గ్రామం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి పది టన్నుల నాణ్యమైన బెల్లం రవాణా చేస్తున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఈ బెల్లాన్ని వినియోగించడం కోసం ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తున్నారు. స్వామి ప్రసాదం కోసం ఉపయోగించనున్న బెల్లం రవాణా చేసే వాహనానికి రైతులు సంప్రదాయబద్ధంగా ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చెరుకు పంటను సాగు చేసి, ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా స్వచ్ఛమైన బెల్లం తయారు చేస్తున్న రైతుల వద్ద నుంచి సేకరించిన బెల్లాన్ని తిరుపతికి పంపుతున్నట్లు తెలిపారు. రైతుల బెల్లానికి తగిన మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి టీటీడీ నుంచి మంచి అవకాశం వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది టీటీడీకి 40 టన్నుల బెల్లాన్ని ఎగుమతి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని, అందులో భాగంగా ముందుగా 10 టన్నుల బెల్లాన్ని ఎగుమతి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో రైతు సంఘాలను ఏర్పాటు చేసి ప్రాసెసింగ్ యూనిట్లను ఎంపిక చేసి వారి ద్వారా తయారుచేసిన బెల్లాన్ని రవాణా చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతు నక్క చిరంజీవి, ఏపీ మార్క్ ఫెడ్ డీఎం రమణి, సూపర్‌వైజర్ కళ్యాణ్, మార్కెటింగ్ ఎస్‌ఎఫ్‌ఏ శివాజీ, ఎంటీ శోభన్‌బాబు, చిన్నమ్మడు, కృష్ణవేణి, తిరుపతి లక్ష్మి, జానకిరామ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు క్షేమేంద్ర శర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం పుష్యశుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివేటి మండపంలో ఉంచారు. అనంతరం ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ కల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలతో పాటు తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యు లు మండవిల్లి రవి తదితరులున్నారు. క్షేత్రానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

25న జాతీయ ఓటరు దినోత్సవం



ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు ప్రాధాన్యం తెలిసేలా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. జనవరి 25న నిర్వహించనున్న 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున 'నథింగ్ లైక్ ఓటింగ్', 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదాలతో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా, బూత్‌స్థాయిలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని, ముఖ్యంగా యువత, సీనియర్ సిటిజన్లకు ఓటరు దినోత్సవ ఆవశ్యకత తెలియజేయాలని అన్నారు. పోలింగ్ బూత్‌లలో నిర్వహించే కార్యక్రమాల్లో కొత్త ఓటరుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులు అందించి సత్కరించాలని ఆయా ఏఈఆర్వోలు, ఈఆర్వోలు అందుకు తగ్గ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నవీన్ స్పష్టం చేశారు.

చేసిన మంచిని చాటిచెబుదాం

● మంత్రి ధర్మాన ప్రసాదరావు



కేడర్‌తో సమావేశమై మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన మంచి పనులను ఊరూరా చాటి చెబుదామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ ఐదేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలను పార్టీ క్యాడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం శ్రీకాకుళం రూరల్ మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 27న భీమిలిలో నిర్వహించనున్న సభ గురించి చర్చించారు. టీడీపీ నాయకుల్లా తాము పక్షపాతం చూపించలేదని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందించామని చెప్పారు. అవినీతికి తావు లేకుండా పాలన సాగించామన్నారు. రాగోలు రోడ్డుకు సంబంధించి రూ.40 కోట్లు మంజూరు చేయించానని, సాంకేతిక కారణాలతో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ, ఎలక్షన్లలోగా ఆ పనులు పూర్తవుతాయన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో నిరుపేదలకు 20వేల పట్టాలు ఇచ్చామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో, వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో బేరీజు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కొనసాగిన కులగణన

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లాలో ఆదివారం కూడా కుల గణన కొనసాగింది. మొత్తం 732 సచివాలయాల పరిధిలో గణన నిర్వహించారు. 11,494 క్లస్టర్లలో 2,54,142 గృహాలను సందర్శించారు. 5,69,204 కుటుంబ సభ్యులను సర్వే చేశారు. 34.40 శాతం పూర్తయ్యింది.

నేటి ఉదయం 9.30 గంటలే చివరి అవకాశం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో సమ్మె బాటలో ఉన్న అంగన్‌వాడీలు విధుల్లో చేరేందుకు సోమవారం ఉదయం 9:30 గంటల వరకు చివరి అవకాశం ఇస్తున్నట్లు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ ఆదివారం రాత్రి పేర్కొన్నారు. ఇప్పటికే టెర్మినేషన్(రద్దు) లిస్టు సిద్ధమైందని, ప్రభుత్వ ఆమోదం పొందడమే తరువాయని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు 2,341 మంది విధుల్లో చేరగా 3,663 మంది చేరాల్సి ఉందన్నారు. వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేడు ఓటర్ల జాబితా విడుదల



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కొత్త ఓటర్ల జాబితా సిద్ధమైంది. తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ సోమవారం విడుదల చేయనున్నారు. జిల్లాలో ఉన్న 30 మండలాల పరిధిలో 8 శాసన సభా నియోజకవర్గాల్లో మొత్తం 18,59,910 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 9,22,442 మంది పురుషులు కాగా, 9,37,329 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 139 మంది ఉన్నారు. ఈసారి ఎక్కువగా యువత ముందుకు వచ్చి ఓటు హక్కును పొందారు. జిల్లాలో 18–19 సంవత్సరాల వయస్సు గల ఓటర్లు 35,037 మంది ఉన్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఓటర్ల సమ్మరీ ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సమ్మరీకి సంబంధించి డ్రాఫ్ట్ పబ్లికేషన్ 2023 అక్టోబర్ 27వ తేదీన విడుదల చేశారు. ఈ జాబితాలో మార్పులు చేస్తు, తుది జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు. ఈ జాబితా ఈఆర్వో, తహసీల్దారు కార్యాలయాల్లోనూ, పోలింగ్ స్టేషన్ల వద్ద, బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ జాబితాలో లోపాలు, ఉంటే ఈఆర్వోకి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అయితే ఓటర్ల చేర్పులు నిరంతర ప్రక్రియ కావడంతో ఇంకా అర్హులైన వారు ఉంటే ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో రద్దీ



బస్సు కోసం నిరీక్షణ



పండగ జ్ఞాపకం



సీటు కోసం ఆరాటం

● ఆర్టీసీకి పండగ

సంక్రాంతి ఆర్టీసీకి కొత్త కాంతి తీసుకువచ్చింది. సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణాలతో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం రద్దీగా మారింది. శ్రీకాకుళం రెండు డిపోల మేనేజర్లు మల్లికార్జునరావు, ఎస్ఎస్ శర్మలు మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా బస్సు సర్వీసులను పెంచి రద్దీని నియంత్రించగలిగామన్నారు.శ్రీకాకుళం రెండు డిపోల నుంచి మొత్తం 64 నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను విశాఖపట్నానికి నడిపామన్నారు. పలాస, టెక్కలి డిపోల నుంచి అదనంగా మరో 30 బస్సులు శ్రీకాకుళం మీదుగా నడిచాయన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

క్లుప్తంగా

అప్సా జిల్లా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



అప్సా జిల్లా కార్యవర్గ సభ్యులు

గార: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. శాలిహుండం కొండపై జిల్లా శాఖ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ వి.సుందరరామ్, కో చైర్మన్ ఎం.రవీంద్రల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. గార మండలం శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ కొర్లాం అప్పలాచార్యులును అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మామిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఈగల వేణు, కోశాధికారిగా బెవర హరినారాయణ, ఉపాధ్యక్షుడిగా పులగాన సూరారెడ్డి, కార్యదర్శిగా నౌపాడ రామారావు, పీఆర్‌ఓగా కొత్తకోట శ్రీరామమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ కో ఆర్డినేటర్ ఎం.రామ్‌మనోహరరావు, రాష్ట్ర సభ్యులు మెట్ట జనార్ధనరావు, తమ్మినేని సింహాచలం, పి.భాస్కరరావు, ఇలపండ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరాలకు కార్తీక్ ఎంపిక



కార్తీక్‌ను అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, పక్కనే అర్జున్ రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఎం.కార్తీక్ జాతీయ పోటీల శిక్షణ శిబిరాలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఏపీ బాస్కెట్‌బాల్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి నుంచి జిల్లా సంఘానికి వర్తమానం అందింది. నేషనల్ మీట్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాస్కెట్‌బాల్ ప్రాబబుల్స్ జట్టుకు 20 మందితో కూడిన క్రీడాకారుల జాబితాను ప్రకటించగా చేయగా.. అందులో శ్రీకాకుళం నుంచి ఎం.కార్తీక్‌కు చోటు లభించింది. ఈ శిక్షణ శిబిరాలు తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం వేదికగా ఈనెల 22వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. శిక్షణ శిబిరాలకు కార్తీక్ ఎంపిక కావడంతో శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆదివారం మండల వీధిలోని తన నివాసంలో కార్తీక్‌ను అభినందించారు. రానుపోను ఖర్చుల కోసం ఆవసరమైన సాయాన్ని అందించారు. ఈ శిక్షణ శిబిరాల్లో ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టు ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లోని కిస్ యూనివర్సిటీ వేదికగా ఫిబ్రవరి 4 నుంచి జరగనున్న 73వ ఆలిండియా నేషనల్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుంది. కార్తీక్‌ను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.వి పద్మావతి, డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి అభినందించారు.

మానసిక ఒత్తిడితో ఏయూ విద్యార్థి ఆత్మహత్య

అల్లిపురం (విశాఖపట్నం): మానసిక ఒత్తిడితో ఏయూ పీజీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, పారాపురం గ్రామానికి చెందిన తంగుడు శివకాశీ ప్రసాద్ (22) ఆంధ్రాయూనివర్సిటీలో పీజీ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఏయూకు సెలవులు కావడంతో భానోజీనగర్‌లోని తన పినతల్లి ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి భోజనాలు చేసిన తరువాత నిద్రపోయిన అతడు ఆదివారం ఉదయం ఎంతకీ లేవకపోవటంతో గది తలుపులు తెరిచి చూశారు. గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సోదరుడు కృష్ణతేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గిడుగు.. తెలుగు భాషకు గొడుగు

- నేడు గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి
- వ్యవహారిక భాషా పితామహుడిగా ఖ్యాతి
- వ్యవహారిక భాషతోనే నేడు బోధన

శ్రీకాకుళం కల్చరల్: గ్రంథాలు పండితులకు మాత్రమే అందుబాటులో ఉన్న పరిస్థితుల్లో.. పుస్తకాలు ఉన్నతులకు మాత్రమే అర్థమవుతున్న కాలంలో ఆ మహానుభావుడు చేసిన పోరాటం భాషను సామాన్యులకు చేరువ చేసింది. పామరుడు కూడా విషయం తెలుసుకోగలిగేలా మార్పులు తీసుకువచ్చింది. వ్యవహారిక భాషపై పోరాటం చేసింది గిడుగు రామ్మూర్తి పంతులు. గ్రాంథిక భాషా చెర నుంచి భాషను విముక్తి చేయడానికి గిడుగు రామ్మూర్తి ఆ కాలంలో పెద్ద పోరాటమే చేశారు. ముఖ్యంగా శిష్ట వ్యవహారికంపై ఆయన పోరాటం చేశారు. వాడుక భాష ద్వారా మాత్రమే ప్రజల భావ వ్యక్తీకరణ జరుగుతుందని, తద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన ప్రజాస్వామిక విలువలు ఏర్పడతాయని ముందుగా గుర్తించి ఛాందసుల నుంచి పెద్ద సవాలునే ఎదుర్కొన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే ఇప్పుడు బోధన, పాఠ్య పుస్తకాల ముద్రణలో వ్యవహారిక భాష కనిపిస్తోంది. అందుకే ఆయన విగ్రహాన్ని ఇంటాక్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఏర్పాటు చేశారు. ఇటీవల గాంధీ మందిరంలో కూడా విగ్రహం ఏర్పాటు చేశారు. పలాస సమీపంలోని రంగోయిలో భద్రి కూర్మారావు గిడుగు కళాపీఠం ఏర్పాటు చేసి గత 20 ఏళ్లుగా భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

సరిహద్దులో పోరాటం..

వ్యవహారిక భాషా పితామహుడైన గిడుగు రామ్మూర్తి శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం, పర్వతాలపేటలో ఆగస్టు 29, 1863లో జన్మించారు.



స్వగ్రామం పర్వతాల పేటలో గిడుగు రామ్మూర్తి విగ్రహం

ఆయన జన్మదినాన్ని తెలుగు భాషా వికాస దినోత్సవం ప్రభుత్వం గుర్తించింది. వ్యవహారిక భాషతో పాటుగా సవర భాషాభివృద్ధికి కృషి చేశారు. సవర భాష లిపి రూపొందించి, ఆ భాషలో రచనలు చేశారు. సవర భాషా నిఘంటువు, వ్యాకరణం తయారు చేశారు. గిడుగుకు జిల్లా సరిహద్దు ప్రాంతం పర్లాఖిమిడి పరిసరాలే పోరాట స్ఫూర్తిని ఇచ్చాయి. 1892లో సవర భాష నేర్చుకోవడం ప్రారంభించారు. శ్రీముఖలింగ ఆలయ గోడలపై ఉన్న శాసనాలను క్రోడీకరించి 'అంటిక్విటీజ్ ఆఫ్ ముఖలింగం' పేరుతో ఇంగ్లిష్ వ్యాసం రచించారు. మాతృభాషలోనే బోధనలు జరగాలని 'తెలుగు' అనే పత్రికను 1919లో ప్రారంభించారు. 1922లో కొన్ని నీతికథలను చిన్నారుల కోసం వ్యవహారికంలో రచించారు. ఆయన సేవలను గుర్తించిన నాటి ప్రభుత్వం 'కైజర్-ఇ-హింద్' బంగారు పతకం, 'రావుసాహేబ్' బిరుదును ప్రదానం చేసింది. 1938లో ఆంధ్రా యూనివర్సిటీ 'కళాప్రపూర్ణ' బిరుదు ఇచ్చి గౌరవించింది. 1940 జనవరి 22న గిడుగు పరమపదించారు.

భాషా సంస్కృతులను కాపాడుతున్నాం



భాషా సంస్కృతులను కాపాడేందుకు గిడుగు ఆశయాల సాధనకు కృషి చేస్తున్నాం. చిన్నతనంలో అమ్మమ్మలు, నాయనమ్మలు చెప్పిన 120 కథలను సేకరించి, పిల్లలు రాసిన కళింగసీమ జానపద కథలు పుస్తకాన్ని కూడా తెచ్చాం.

– బద్రి కూర్మారావు, గిడుగు రామ్మూర్తి పీఠం నిర్వాహకులు

గిరిజన యూనివర్సిటీకి గిడుగు పేరు పెట్టాలి



విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీకి గిడుగు రామ్మూర్తి పేరు పెట్టాలి. ఆయన వ్యవహారిక భాషోద్యమం ఫలితంగానే తెలుగు భాషలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి.

– వాండ్రంగి కొండలరావు, నామ విజ్ఞాన వేత్త, జీవితకాల సభ్యుడు ఎన్‌బీటీ క్లబ్, పొందూరు

ఊళ్లు మారాయి



మాకివలస లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఇలాంటి ప్రభుత్వాన్ని ఆదరించండి: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- అట్టహాసంగా మాకివలసలో 200వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఊళ్లు మారాయని, కొత్తగా పల్లెలు నిర్మాణమయ్యాయని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. మాకివలసలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం 200వ రోజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సచివాలయం వద్ద నిర్వహించిన సభలో మాట్లాడారు. టీడీపీ వాళ్లు కళ్లుండీ అభివృద్ధి చూడలేకపోతున్నారని విమర్శించారు. గ్రామంలో సచివాలయం కట్టి పాలన అందుబాటులోనికి తీసుకురావడం బాదుడా, ఎరువులు విత్తనాలు సక్రమంగా స్వగ్రామంలోనే అందించినందుకు బాదుడా, ఆరోగ్యం అందుబాటులోనికి తీసుకురావడం బాదుడా అని ప్రశ్నించారు. టీడీపీ మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ స్థానాన్ని గెలిపించండి..

శ్రీకాకుళం ఎంపీ స్థానాన్ని గెలిచి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇద్దామని పార్టీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు పదేళ్లలో జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇప్పటి నుంచే టీడీపీ వాళ్లకు ఓటమి భయం పట్టుకుందని, టీడీపీలో చేరికలంటూ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, మాకివలస సర్పంచ్ రావాడ మోహనరావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు యాళ్ల కృష్ణంనాయుడు, శాస్త్రి, యాళ్ల మోహనరావు, యాళ్ల పాపారావు, బుద్దల రాజశేఖర్, చల్ల తాతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

సెబ్‌లో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం

సీఐలు	ప్రస్తుతం పనిచేసిన చోటు	బదిలీ జరిగిన చోటు
కె.సునీల్‌కుమార్	ఆమదాలవలస	నర్సీపట్నం
జీసీహెచ్ కిరణ్‌మహేశ్వరి	రణస్థలం	చోడవరం
ఎ.శ్రీరంగందొర	నరసన్నపేట	ఎస్‌కోట
వై.లక్ష్ముంనాయుడు	పాతపట్నం	గాజువాక
డి.అనిల్‌కుమార్	టెక్కలి	అనకాపల్లి
బి.నాగవేణి	కోటబొమ్మాళి	అరకు
టీవీఎ నాయుడు	సోంపేట	సీతమ్మధార
బి.నర్సింహమూర్తి	పలాస డీటీఎఫ్	పార్వతీపురంఇంటెలిజెన్సు
బీవీ మురళీధర్	శ్రీకాకుళం ఇంటెలిజెన్సు	బొబ్బిలి
టి.నాగేశ్వరరరావు	శ్రీకాకుళం	అనకాపల్లి ఇంటెలిజెన్సు
జె.శ్రీనివాసరావు	పురుషోత్తపురం చెక్‌పోస్టు	సీతానగరం
జె.ఇంద్రజిత్	నందిగాం	రంపచోడవరం
ఎల్.ఉపేంద్ర	పార్వతీపురం	గోపాలపట్నం
ఎస్ విజయ్‌కుమార్	పాలకొండ	విజయనగరం ఇంటెలిజెన్స్
జె.సతీష్‌కుమార్	పార్వతీపురం డీటీఎఫ్	పాడేరు
ఎంవీ గోపాలకృష్ణ	పార్వతీపురం ఇంటెలిజెన్సు	శ్రీకాకుళం
ఎస్.సింహాద్రి	వి.మాడుగుల	పార్వతీపురం
ఎస్ఐలు:		
ఎస్.పిచ్చేశ్వర రావు	రాజాం	పురుషోత్తపురం చెక్‌పోస్టు
ఆర్.మహేష్‌బాబు	పాలకొండ	పెందుర్తి
ఎం.శేఖరం	పాలకొండ	పాడేరు
జె.రాజశేఖర్	పార్వతీపురం డీటీఎఫ్	సబ్బవరం
ఎం.మోహనరావు	శ్రీకాకుళం	మహారాణిపేట
టి.హేమమందిర	ఆమదాలవలస	పురుషోత్తపురం చెక్‌పోస్టు
జె.సంధ్యారాణి	నరసన్నపేట	సాలూరు
ఎస్‌కే రహీమ్	రణస్థలం	గొలుగొండ
కె.అప్పలస్వామి	రణస్థలం	నర్సీపట్నం
వై.చంద్రమోహన్	శ్రీకాకుళం డీటీఎఫ్	సోంపేట
ఎస్‌జీఎల్ దస్తగిరి	పాతపట్నం	పాడేరు డీటీఎఫ్
దేవరపల్లి ప్రభాకరరావు	కొత్తూరు	అరకు బీఎంపీపీ
వి.వేణుగోపాల్	టెక్కలి	విశాఖపట్నం డీటీఎఫ్
దువ్వు ప్రభాకరరావు	కోటబొమ్మాళి	కూనేరు చెక్‌పోస్టు
కె.కృష్ణారావు	పలాస	పార్వతీపురం డీటీడబ్ల్యు/సీఆర్
యు.వి.వి.నాగరాజు	సోంపేట	పి.కోనవలస చెక్‌పోస్టు
జి.వి.రమణ	సోంపేట	విశాఖపట్నం డీటీడబ్ల్యు/సీఆర్
ఎస్.ముసలినాయుడు	ఇచ్ఛాపురం	సీతమ్మధార
కె.కళ్యాణి	పాతపట్నం	బీఎంపీపీ-1 నెల్లిమర్ల
జీసీహెచ్‌నాయుడు	ఇచ్ఛాపురం	బీఎంపీపీ పాలకొండ
ఎస్.గురుమూర్తి	పురుషోత్తపురం చెక్‌పోస్టు	చీపురుపల్లి
బి.ఆర్.ఎస్.పట్నాయిక్	వసుంధర చెక్‌పోస్టు	సీతానగరం
వి.వి.రమణ	కురుపాం	వసుంధర చెక్ పోస్టు
సీసీహెచ్‌ఎల్‌పీఎస్.కుమార్	శ్రీకాకుళం డీటీ డబ్ల్యు/సీఆర్	కోటబొమ్మాళి
పి.కరుణప్రసాద్	పురుషోత్తపురం చెక్‌పోస్టు	చింతపల్లి
డి.పద్మావతి	భీమిలి	పార్వతీపురం
కె.శ్రావణి	అనకాపల్లి	కొత్తూరు
ఎస్.చంద్రశేఖర్	చోడవరం	రాజాం
బి.చంద్రశేఖర్‌రాజు	నర్సీపట్నం	పాలకొండ
జీసీహెచ్‌వీరమణారావు	అరకు	పలాస డీటీఎఫ్
ఇ.రామకృష్ణ	భోగాపురం	పొందూరు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగానికి చెందిన 17 మంది ఇన్‌స్పెక్టర్లు, 31 సబ్‌ఇన్‌స్పెక్టర్లకు బదిలీ జరిగింది. ఈ మేరకు సంబంధిత శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

నాలుగు పూరిళ్లు దగ్ధం

జలుమూరు: అంధవరం పంచాయతీ పరిధి రామకృష్ణాపురంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన జావాన అసిరిపోలు,జావాన కృష్ణ, జావాన లక్ష్మి, జమ్మి రమణమ్మలకు చెందిన ఇళ్లు కాలిబూడిదయ్యాయి. రాత్రి పూట ప్రమాదం జరగడంతో కారణం తెలియరాలేదు. ముందుగా జావాన అసిరిపోలు ఇంటిలో మంటలు ప్రారంభమై వరుసగా ఉన్న ఇళ్లకు వ్యాపించాయి. దుస్తులు, ఇంటి సామాన్లు భద్రపరచగలిగామని, తిండి గింజలు, కొద్దిపాటి వంట సామగ్రి కాలిపోయాయని బాధితులు తెలిపారు.

నరసన్నపేట ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు అదుపు చేసింది. వీఆర్వో గోపి ప్రమాద బాధితులను పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కొత్తపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మందస: కొత్తపల్లి సమీపంలో గల రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మందస–బారువ రైల్వేస్టేషన్ మధ్య కొత్తపల్లి గ్రామం సమీపంలోని మహేంద్ర తనయ నదిపై ఉన్న బ్రిడ్జికి ఆనుకుని మృతదేహం పడి ఉండడంతో పలాస రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వివరాలు లభించలేదు. రైలు నుంచి జారిపడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. పలాస జీఆర్పీ ఎస్ఐ షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

'ఎప్పటికీ వైఎస్ జగన్‌కే మా మద్దతు'

కవిటి: గ్రామంలోని సమస్యలపై చర్చించేందుకు వెళ్తే తమకు టీడీపీ కండువాలు వేశారని, కానీ తాము ఎప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికే మద్దతు ఇస్తామని నెలవంక పంచాయతీకి చెందిన పలువురు కార్యకర్తలు తెలిపారు. నెలవంక పంచాయతీలో వైఎస్సార్‌సీపీ క్యాడర్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇందులో వారి అభిప్రాయాలు తెలుసుకున్న మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ వారందరికీ తాను అన్ని వేళల్లోనూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ అన్నివిధాలుగా ఆదుకుంటుందని వారికి తెలిపారు. దీనిపై స్పందించిన కార్యకర్తలు దుక్క చిరంజీవి(పెద్దరెడ్డి), కర్రి శంకర్, దుక్క జోగారావు, కొరికాన కృష్ణారావు, కొరికాన ప్రకాష్, దుక్క వెంకటరావు, నీలాపు దేవరాజు, దూగాన ఆదయ్య తదితర 30 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ పార్టీలోనే కొనసాగుతున్నామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో నేతలు ఏఎంసీ వైస్ చైర్మన్ వై నీలయ్య,వ్యవసాయసలహామండలి కన్వీనర్ దువ్వు కృష్ణారెడ్డి,సర్పంచ్ భర్త కుమార్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్‌తో నెలవంక పంచాయతీ పార్టీ శ్రేణులు

నాగావళి తీరాన రామ క్రతువు

శ్రీకాకుళం కల్చరల్:

అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠ సందర్భంగా నగరంలో శ్రీరామ క్రతువు నిర్వహించనున్నారు. అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక ఆధ్వర్యంలో ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయం వద్దగల నాగావళి తీరంలో నిర్వహించనున్న క్రతువుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. హృషికేశ్ నుంచి వచ్చిన సిద్ధయోగ మహారాజ్ ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రదేశాల్లో, రామ మందిరాల్లో పెద్దఎత్తున పూజలు, అభిషేకాలు, హోమాలు జరుగుతున్నాయన్నారు. ఆర్ష విజ్ఞాన వాటిక, లైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లపై కమిటీ సమావేశం ఉమారుద్ర కోటేశ్వరాలయం వద్ద గల వేదిక వద్ద ఆదివారం జరిగింది. అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక వ్యవస్థాపకులు భాస్కరభట్ల శ్రీరామమూర్తి మాట్లాడుతూ వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా పాల్గొనాలని కోరారు.



పరిశీలిస్తున్న సిద్ధయోగ మహారాజ్ స్వామి



నాగావళి తీరంలో ఏర్పాట్లు

'సాంఘిక శాస్త్రంతో నైతిక విలువలు'



జిల్లా విద్యాశాఖ అధికారులు, సోషల్ స్టడీస్ ఫోరం ప్రతినిధులతో కలిసి పాఠశాల రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేవానందరెడ్డి, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాంఘిక శాస్త్ర అధ్యయనంతో విద్యార్థులకు నైతిక, మానవతా విలువలు అలవడతాయని ఏపీ రాష్ట్ర పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సోషల్ స్టడీస్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు వైవీ రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేవానందరెడ్డి మాట్లాడుతూ అన్ని శాస్త్రాల్లో సాంఘిక శాస్త్రం సమున్నతమని, ప్రత్యేకత కలిగినదని అన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ ఉపాధ్యాయులకు అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికంగా మొదటిసారిగా శ్రీకాకుళంలో వేదికగా రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం చేస్తున్న కార్యక్రమాలను జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు వివరించారు. ఈ సందర్భంగా పలువురు సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు ప్రదర్శించిన విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

23న ఇచ్ఛాపురం రానున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

శ్రీకాకుళం: ఇచ్ఛాపురంలో జరగనున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత కార్యవర్గ సమావేశానికి ఈ నెల 23న రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రానున్నారని జిల్లా డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 23వ తేదీ ఉదయం విశాఖపట్నం నుంచి జాతీయ రహదారి మీదుగా ఇచ్ఛాపురం చేరుకుంటారని తెలిపారు. ఇచ్ఛాపురంలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ముగించిన విజయ చిహ్నం వద్ద నివాళులర్పిస్తారని, అనంతరం ఆర్‌జే ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారని తెలిపారు.